సాక్షి
చిత్తూరు
గురువారం । 5 । డిసెంబర్ । 2024



పీహెచ్‌సీ మూసేశారు

18 గ్రామాల ప్రజలకు సేవలందిస్తున్న లద్దిగం పీహెచ్‌సీని కూటమి సర్కారు పాలకులు కుంటిసాకుతో మూసేశారు. - 8లో



రెడ్‌క్రాస్ అభివృద్ధికి చర్యలు

యువతను చైతన్య పరిచి రెడ్‌క్రాస్ అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలని జేసీ విద్యాధరి సూచించారు. - 8లో



డీఈఓకు సమ్మె నోటీసు అందజేత

ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని 11న సమ్మె చేపట్టనున్నట్లు యూటీఎఫ్ నేతలు తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

ఉత్తీర్ణత శాతం పెంచండి



జిల్లా పరిషత్ పాఠశాలను తనిఖీ చేస్తున్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు

కుప్పం: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గరికచీనేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్తీర్ణత శాతం పెంచాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల పరిధిలోని గరికచీనేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అపార్ కార్డులు జారీ చేయడంలో ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులకు కనీస సదుపాయాల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శరవణ, దాసేగానూరు సర్పంచ్ మురుగేష్, రైతు విభాగ అధ్యక్షుడు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విరాళం

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని నిత్యాన్నదానం, గోసంరక్షణ ట్రస్టుకు బుధవారం పలువురు దాతలు నగదు విరాళం అందించారు. తెలంగాణకు చెందిన గాడిపాటి వెంకటేశ్వర్లు నిత్యాన్నదానానికి రూ.ఒక లక్ష, గో సంరక్షణ ట్రస్టుకు రూ.ఒక లక్ష చొప్పున విరాళమిచ్చారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లా పెదపాడుకు చెందిన వేణు సత్యవతి రూ.ఒక లక్షను విరాళంగా ఆలయ అధికారులకు అందించారు. వీరికి అధికారులు స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

అంటుకట్టు పద్ధతులపై శిక్షణ



శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కుప్పం: కుప్పం హార్టికల్చర్ హబ్‌లో ఇండో–ఇజ్రాయెల్ కూరగాయలు అంటుకట్టు విధానం, సాగు పద్ధతుల గురించి రెండు రోజుల శిక్షణా తరగతులు జరిగాయి. బుధవారం 12 రాష్ట్రాలు, 35 మంది ఉద్యానశాఖ అధికారులకు మొదటగా శ్రీకృష్ణకిషోర్ అంటుకట్టు విధానం, ఉపయోగాల గురించి వివరించారు. అనంతరం శాంతిపురం మండలం కోనేరు కుప్పం గ్రామంలో విశ్వనాథరెడ్డి పొలంలో అంటుకట్టిన వంగ మొక్కల సాగు తోటను పరిశీలించారు. తరువాత గంగవరం మండలం గుండ్రాజు గ్రామానికి చెందిన గ్రీన్ ఆర్బిట్ ఫార్మ్స్‌కు సంబంధించి శ్రీనివాసులుకు చెందిన నేల రహిత సాగు విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఇండో ఇజ్రాయెల్ ఎంబసీ న్యూఢిల్లీ, హార్టికల్చర్ ప్రతినిధి వూరీ రూబీన్ స్టీన్, ప్రాజెక్టు ఆఫీసర్ బ్రహ్మదేవ్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, హార్టికల్చర్ అధికారి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ గ్రీవెన్స్‌కు 4 వినతులు



సమస్యలు తెలుసుకుంటున్న డీఈ ప్రసాద్

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక గాంధీరోడ్డులోని బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల నుంచి 4 సమస్యలపై వినియోగదారులు అధికారులకు విన్నవించారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను డీఈలు ప్రసాద్, ఆనంద్ ఆదేశించారు. తన భర్త మరణించాడని, ఆయన పేరు మీద ఉన్న మీటర్‌ను తన పేరకు మార్చాలని, మీటర్ సక్రమంగా పనిచేయడం లేదని, కరెంటు స్తంభాలను తమ ప్రాంతంలో పెట్టాలని 2 సమస్యలు వచ్చాయి. మీటర్ పేరు మార్పునకు ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని, మీటర్ చెకింగ్‌కు రుసుం చెల్లించాలని, కరెంటు స్తంభాలు ఏర్పాటు చేస్తామని అధికారులు వివరించారు. కార్యక్రమంలో జేఏఈ గోవిందరాజులు, టెక్నికల్ ఏఈ మాధురి పాల్గొన్నారు.

13న చొక్కాణి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 13వ తేదీ చొక్కాణి నిర్వహించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి బుధవారం ఓ ప్రకటన విడుదలలో తెలిపారు. ఆలయంలో ఈ ఉత్సవాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. శివయ్యను అగ్నితో పూజించే విధానం ఉందని తెలిపారు. అందుకు నిదర్శనమే చొక్కాణి ఉత్సవమని తెలిపారు. ఇక 15వ తేదీ పౌర్ణమి సందర్భంగా గిరిప్రదక్షిణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 14న వేయిలింగాల కోనలో ఏర్పాట్లను పరిశీలిస్తామన్నారు. 15న ఆదివారం బ్రహ్మర్షి చాగంటి కోటేశ్వరరావు శిష్య బృందం శ్రీగురువాణి సొసైటీకి చెందిన సుమారు 200 మంది గిరిప్రదక్షిణలో పాల్గొంటారని తెలిపారు.

బంతి విలాపం.. చాందినీ వికాసం

నాటురకం బంతిపూలు కొనేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో సాగు చేసిన రైతులు వాటిని రోడ్డుపై పారబోస్తున్నారు. దీంతో అన్నదాతలకు నష్టాలు తప్పడం లేదు. జిల్లాలోని పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో ఈ పూలతోటలు సాగు అధికంగా ఉంటుంది. అయితే హైబ్రిడ్ రకం పూలకు మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉంటోంది. రైతులు ఈ హైబ్రిడ్ రకం పూలతోటలు సాగు చేస్తే లాభాలు పొందుతారని హార్టికల్చర్ అధికారులు చెబుతున్నారు.



పలమనేరు మండలం దిగువమారుమూరు వద్ద సాగవుతున్న సెంట్ రెడ్ రకం కస్తూరి చామంతి



ధరలు పలుకని సంప్రదాయ రకం బంతిపూలు (ఇన్‌సెట్) బొకేలకు వాడుతున్న సెంట్ రెడ్ రకంచామంతి



- మార్కెట్‌లో నాటురకం బంతిపూలకు ఆదరణ కరువు
- రోడ్డుపై పారబోస్తున్న అన్నదాతలు
- పాత వెరైటీల సాగుతో నష్టాలబాట
- కనీసం కిలో రూ.4 కూడా పలకని నాటురకం బంతి
- హైబ్రిడ్ రకాలైన కస్తూరి చాందిని సాగుతో అధిక ఆదాయం
- రైతులు అప్‌డేట్ కావాలంటున్న హార్టికల్చర్ అధికారులు

పలమనేరు: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పూలసాగు ఎక్కువగా పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో ఉంటుంది. ఈ దఫా ఈ ప్రాంతంలో నాటు రకాలైన బంతి, చామంతిని సాగుచేసిన పూలరైతులు తీవ్ర నష్టాలబాటలో పయనిస్తున్నారు. బంతిపూలు కిలో రూ.4 కూడా పలకపోవడంతో కొనేవారు లేక పూలను రైతులు రోడ్డుపై పారబోస్తున్నారు. ఇదే సమయంలో చామంతిలో హైబ్రిడ్ రకాలైన సెంట్ రెడ్, ఎల్లో, వైట్, వైలట్ రకాలను సాగు చేసిన రైతులు లక్షాధికారులుగా మారుతున్నారు. ఇవి వారం రోజులైనా వాడకుండా ఉండడంతో, బొకేలకు, ఫంక్షన్ హాళ్ల అలంకరణకు వాడుతుండడంతో వీటికి మంచి డిమాండ్ ఉంది. దీంతో వీటి ధర ప్రస్తుతం కిలో రూ.వందకు పైమాటే. పూల రైతులు వారి పొలంలో కాస్త పెట్టుబడి ఎక్కువగా పెట్టి నాటీ రకాల బదులు డిమాండ్ ఎక్కువగా ఉన్న హైబ్రిడ్ రకాలను సాగుచేస్తే లాభాల పట్టేవారు. కానీ రైతులు అప్‌డేట్ కాకపోవడమే నష్టాలకు కారణమవుతోంది.

లక్ష పెట్టుబడితో రూ.3 లక్షల లాభం

హైబ్రిట్ రకాల పూల సాగు పంటకాలం నాలుగునెలలు. రెండో నెల నుంచే పూలు కోతకొచ్చి రెండునెలల పాటు కోతలు ఉంటాయి. ఎకరా పొలంలో 7 నుంచి 9వేల హైబ్రిడ్ రకాల సీడ్స్ అవసరం ఉంటుంది. ఒక్కో సీడ్ రూపాయిగా కర్ణాటకలోని తుముకూర్, తమిళనాడులోని రాయకోట నర్సరీలో వీటిని విక్రయిస్తున్నారు. ఎకరా పొలానికి పెట్టుబడిగా మల్చింగ్‌తో సహా రూ.లక్ష దాకా అవుతోంది. పంట బాగా వస్తే ఎకరానికి 30 టన్నుల ఉత్పత్తి ఉంటుంది. ప్రస్తుతం హైబ్రిడ్ రకాల పూల ధరలు కిలో రూ.100 వరకు ఉన్నాయి. ఈ లెక్కన 30 టన్నులకు రూ.3 లక్షలు వస్తుంది.

హైబ్రిడ్ పూల సాగుతో లాభాలు..

పూలను సాగుచేసే రైతులు సంప్రదాయ రకాలైన బంతి, చామంతిని ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్నారు. వీటికి ధరలు లేక తీవ్రంగా నష్టపోతున్నారు. అదే హైబ్రిడ్ రకాలైన కస్తూరి చాందిని రకాలైన సెంట్ రెడ్, వైట్, ఎల్లో, వైలట్ రకాలను సాగుచేసిన రైతులు లాభాల బాటలో ఉన్నారు. ఎందుకంటే ఈ రకం పూలు వారం రోజులైనా వాడకుండా ప్లాస్టిక్ పూలవలే వికసిస్తూ ఉంటాయి. వీటిని దూర ప్రాంతాలకు సైతం రవాణా చేసేందుకు వెలుసుబాటుగా ఉంటుంది. అదే నాటి రకాలు మూడు రోజుల్లోనే వాడిపోతుంటాయి. దీంతో పూల వ్యాపారులు సైతం హైబ్రిడ్ రకాలను కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీనికి తోడు ఈ రకం పూలను బొకేలకు సైతం ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీంతో వీటికి ఎప్పుడూ డిమాండ్ ఉండడంతో ధరలు ఎక్కువగా ఉంటున్నాయి.



సెంట్ రెడ్ రకం కస్తూరి చామంతి



కొనేవారు లేక బంతిపూలను రోడ్డుపక్కన పడేస్తున్న పూల రైతులు

అదే నాటి రకం పూలైతే..

నాటి రకమైన బంతి 70 రోజులకు కోతకొచ్చి ఆపై 40 రోజులు కటింగ్‌లు ఉంటాయి. అదే చామంతి అయితే 90 రోజులకు కోతకు వచ్చి ఆరునెలలు కటింగ్ ఉంటాయి. వీటి సాగు కోసం ఎకరా పొలంలో రైతు పంట పెట్టుబడిగా రూ.50వేలు పెటాలి. పంట దిగుబడి బాగా వస్తే పదిటన్నుల పూల ఉత్పత్తి ఉంటుంది. ఇప్పుడు ఉన్న ధర కిలో రూ.4తో రూ.40వేలు మాత్రమే దక్కుతుంది. దీంతో రైతుకు నష్టం తప్పదు. అందువల్ల రైతులు వారిపొలంలో నాటి రకాల పూలకు బదులు హైబ్రిడ్ రకాల పూలను సాగు చేసుకుంటే నికర లాభాలు రావడం తథ్యం

హైబ్రిడ్ రకాలనే సాగు చేయాలి



నాటి రకాలైన బంతీ, చామంతిలను సాగుచేసి నష్టాలు బాట పట్టాం. అందుకే తమిళనాడులోని రాయకోట నుంచి సెంట్ ఎల్లో, వైట్, రెడ్ రకాల హైబ్రిడ్ రకాల పూలను సాగుచేసి నికర లాభాలను పొందుతున్నాం. రైతులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ డిమాండ్ ఉన్న పూలను సాగుచేయడం అలవర్చుకోవాలి. అప్పుడే లాభాలు వచ్చే అవకాశం ఉంటుంది. – రవీంద్ర, పూలరైతు, కూర్మాయి గ్రామం, పలమనేరు మండలం

అవగాహన కల్పిస్తూనే ఉన్నాం..



సంప్రదాయ రకాలైన బంతి పూలకు ఇప్పుడు కాలం చెల్లింది. వీటికి ఎప్పుడు ధరలుంటాయో తెలియని పరిస్థితి. అందువల్ల రైతులు మార్కెట్‌లో ఎక్కువగా డిమాండ్ ఉన్న హైబ్రిడ్ రకాల పూలను సాగు చేసుకోవడం మేలు. ఎందుకంటే అదే పొలంలో కాస్త ఎక్కువగా పెట్టుబడి పెట్టి నికరంగా లాభాలను పొందే అవకాశం ఉంటుంది. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తూనే ఉన్నాం.

– డా.కోటేశ్వర్‌రావు, సహాయ సంచాలకులు, ఉద్యానశాఖ

సంద్రంలా ఎన్టీఆర్ జలాశయం





నీవానది నుంచి బయటకు వస్తున్న నీరు (ఇన్‌సెట్) నీటి ప్రవాహంలోనే ప్రయాణిస్తున్న వాహనాలు

పెనుమూరు(కార్వేటినగరం) : గత నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కలవకుంట వద్ద నీవానదిపై నిర్మించిన ఎన్టీఆర్ జలాశయం సముద్రాన్ని తలపిస్తూ, సందర్శకులను ఆకట్టుకుంటోంది. జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి భారీ ఎత్తున వరద నీరు చేరుతుండడంతో నీటి సామర్థ్యం 108.5 ఎంసీఎఫ్టీకి చేరుకుంది. ఇరిగేషన్ డీఈ జయచంద్ర,ఏఈ భరత్‌కుమార్‌రెడ్డి నీవానది దిగువ ప్రాంతాలైన పెనుమూరు, గంగాధరనెల్లూరు మండలాల్లో నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేశారు. బుధవారం 5 గేట్లను ఎత్తి సుమారు 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

ప్రమాదపుటంచున ప్రయాణం..

ఒక్కసారిగా 5 గేట్లు ఎత్తడంతో జలాశయం దిగువన ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుపై భారీగా నీరు ప్రవహించడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ రోడ్డు కూడా సక్రమంగా లేకపోవడంతో నీటి ఉధృతికి వాహనాలు కొట్టుకుపోయే పరిస్థితి నెలకొందని వాహనదారులు ఆరోపించారు. ప్రతిసారి ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నా సంబంధిత అధికారులు మాత్రం పటించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 01 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 60,301 మంది స్వామిని దర్శించుకున్నారు. 20,222 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.3.32 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 8 గంటలు పడుతోంది.

కొండలను తవ్వేస్తున్నారు సార్..

- కాపాడాలని నగరి ఎమ్మెల్యేకు యువకుల వినతి



ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు సమస్యను విన్నవిస్తున్న యువకులు

నగరి : మున్సిపల్ పరిధిలోని కీళపట్టు శివార్లలోని కొండలను తవ్వేస్తున్నారని, దీంతో తమకు జీవనాధారమైన అడవి, కొండ నాశనమవుతోందని పర్యావరణాన్ని రక్షించాలంటూ కొండ ప్రాంతం సమీపంలోని గ్రామాల యువకులు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను కలిసి విన్నవించుకున్నారు. బుధవారం తిరుపతికి వెళ్లి ఎమ్మెల్యేను కలిసిన వారు పర్యావరణాన్ని రక్షించాల్సిన అధికారులు క్వారీలకు అనుమతిచ్చి ప్రజల జీవనాధారమైన కొండలు, అడవులు కోల్పోయేలా చేస్తున్నారన్నారు. గ్రామస్తులతో ఎలాంటి చర్చలు చేయకుండానే క్వారీలకు, క్రషర్లకు అనుమతులు ఇచ్చారని, దీంతో తమకు జీవనాధారంగా నిలుస్తున్న కొండలు, అడవులు క్వారీ నిర్వాహకుల వల్ల నాశనమవుతున్నాయని వాపోయారు. కొండలపై బాంబులు పేలుతుంటే పశువులు ఎలా మేతకు వెళ్తాయన్నారు. స్థానికుల కోరిక మేరకు డీఆర్‌డీఓ నిర్వహించిన సదస్సులోనూ గ్రామస్తులు మైనింగ్ రద్దు చేయాలని కోరడం జరిగిందన్నారు. అయినా క్వారీ యాజమాన్యం అలానే నిర్వహిస్తున్నారని, తక్షణం క్వారీలను ఆపి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు. సంబంధిత అంశాన్ని పరిశీలిస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

కూరగాయల వితరణ



కూరగాయలను పంపుతున్న దాతలు

పలమనేరు: తిరుచానూరు అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా 3 టన్నులు, తిరుమలకు 10 టన్నుల కూరగాయలను ప్రత్యేక వాహనంలో బుధవారం పంపినట్టు పట్టణానికి చెందిన శ్రీవారి భక్తుడు రవీంద్రారెడ్డి తెలిపారు. వాటిని దాతలు ఎన్ఆర్ఐ సురేష్, డా.వెంకటరెడ్డి, మంజునాథం సాయంతో కర్ణాటకలో కొనుగోలు చేసి పంపించారు.

అభ్యంతరాలుంటే తెలపండి

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని నగరపాలక, మున్సిపల్ స్కూళ్ల టీచర్ల ఉద్యోగోన్నతి జాబితాలో అభ్యంతరాలుంటే తెలపాలని డీఈఓ వరలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నగరపాలక, మున్సిపాలిటీల స్కూళ్లల్లో పనిచేస్తున్న ఎస్జీటీ, భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్లుగా (అన్ని సబ్జెక్టులు) ఉద్యోగోన్నతి కల్పించనున్నట్లు చెప్పారు. ఈ ప్రక్రియకు సంబంధించిన జాబితాను డీవైఈఓ, ఎంఈఓల మెయిల్స్‌కు పంపామన్నారు. వాటిని పరిశీలించి ఏవైనా అభ్యంతరాలుంటే సంబంధిత ఆధారాలతో ఈ నెల 7వ తేదీ సాయంత్రంలోపు చిత్తూరు డీఈఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఆ తర్వాత వచ్చే అభ్యంతరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబోమన్నారు.

బాధ్యతల స్వీకరణ



పీడీగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీదేవి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా అర్హులందరికీ పింఛన్లు అందేలా చర్యలు చేపడతానని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి అన్నారు. బుధవారం ఆమె డీఆర్‌డీఏ పీడీగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు అందేలా చర్యలు చేపడుతానని చెప్పారు. జిల్లాలోని స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతానని తెలిపారు.

తాళిబొట్లు తెగుతున్నా పట్టించుకోరా..?

- పచ్చికాపల్లంలోని పెద్దపోటుచేను రోడ్డులో మద్యం షాపు వద్దంటూ నిరసన
- మద్యం మహమ్మారి వల్ల ఇంటి పెద్దదిక్కులను కోల్పోయామని ఆవేదన
- అధికారుల తీరును నిరసిస్తూ గ్రామస్తుల ధర్నా



కార్వేటినగరం రోడ్డులో ధర్నా చేస్తున్న పెద్ద పోటుచేను గ్రామస్తులు

వెదురుకుప్పం: ''మద్యం మహమ్మారి వల్ల ఇప్పటికే తాళిబొట్లు తెగి కుటుంబాలు వీధిన పడ్డాయి.. ఒంటరిగా ఉన్న మహిళలపై తప్పతాగి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు.. నివాసాల వద్ద మద్యం షాపు వద్దు'' అని మండలంలోని పెద్దపోటుచేను గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని పచ్చికాపల్లంలో పెద్దపోటుచేను గ్రామానికి వెళ్లే రోడ్డులో గ్రామ సచివాలయం వద్ద మద్యం షాపు ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ విషయం తెలిసి గ్రామస్తులు మద్యం షాపు ఇక్కడ వద్దంటూ బుధవారం కార్వేటినగరం ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామానికి వెళ్లే రోడ్డుపక్కన వైన్ షాప్ ఏర్పాటు చేస్తే తమకు అనేక రకాల సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. ఈ మార్గంలో నిత్యం మహిళలు, విద్యార్థులు, చిరు వ్యాపారులు వెళ్తుంటారని చెప్పారు. చుట్టూ నివాసాలు కూడా ఉన్నాయని, పక్కనే గ్రామ సచివాలయం కూడా ఉందని తెలిపారు. మందుబాబులు తప్పతాగి కార్యాలయంలోకి వెళ్లి గొడవలు చేసే అవకాశం ఉందని ఆక్షేపించారు. ప్రశాంతంగా ఉన్న ప్రాంతంలో మద్యం షాపు వద్దని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. గతంలో మద్యం సేవించి అనేక కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయాయన్నారు. భర్తను కోల్పోయి వితంతువులుగా బతుకుతున్న తమ బాధను అర్థం చేసుకోవాలని, ఉన్న ఈ కొద్ది రోజులైనా ప్రశాంతంగా బతకనివ్వండి అంటూ మహిళలు వేడుకున్నారు. మద్యం షాపు వద్దంటూ కార్వేటినగరం ఎక్సైజ్ సీఐకి కూడా ఫిర్యాదు చేశామని, మద్యందుకాణం వేరే చోట పెట్టుకునేలాల అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోం..



ఇక్కడ వైన్ షాప్ ఏర్పాటును గ్రామస్తులంతా మూకుమ్మడిగా అడ్డుకుంటాం. ఎట్టిపరిస్థితుల్లోనూ ఒప్పుకునేది లేదు. మద్యం తాగి ఇళ్లపైకి వస్తే ఎవరూ ఊరుకోరు. సచివాలయంలో మహిళలు పని చేస్తున్నారు. వారికి కూడా రక్షణ లేకుండా పోతుంది. మా గ్రామస్తులంతా ఎంతవరకైనా వెళ్తాం.

హేమశేఖర్ రెడ్డి, గ్రామస్తుడు.

ఒంటరిగా వెళ్లలేం...



మా గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన బ్రాందీ షాపు పెడితే ఒంటరిగా వెళ్లలేం. మేము కూరగాయలు అమ్ముకుని వెళ్తాం. బ్రాందీ షాపు పెడితే తాగిన వాళ్లకు తల్లి అనేది తెలియదు.. చెల్లి అని తెలియదు. ఎలా పడితే అలా మాట్లాడుతారు. రాత్రి పూట నాలుగైదు గ్రామాల వారు ఈ దారిలో వస్తుంటారు. ఇక్కడ పెట్టేందుకు వీల్లేదు. – భారతి, గ్రామస్తురాలు

పకడ్బందీగా నిర్వహిస్తాం..

మద్యం షాపు ఏర్పాటు వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా చర్యలు తీసుకుంటాం. దుకాణం వద్ద మద్యం తాగడానికి అనుమతి ఇవ్వం. విక్రయాలకు కూడా బహిరంగంగా కాకుండా షీట్లు ఏర్పాటు చేస్తాం. గ్రామస్తుల వినతిని ఉన్నత స్థాయి అధికారులకు తెలియజేస్తాం. ఆ స్థలం అనుకూలంగా ఉంది గనుకే ఎంపిక చేశారు.

– శిరీషదేవి, సీఐ, ఎక్సైజ్ శాఖ, కార్వేటినగరం

క్లుప్తంగా

11 లీటర్ల సారా స్వాధీనం

కార్వేటినగరం: వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లిలో ఒక వ్యక్తి నుంచి 11 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, అరెస్టు చేశారు. బుధవారం నిందితుడి అరెస్టుతో పాటు మీడియాకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ సీఐ జవహర్ బాబు వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు డివిజన్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి ఆదేశాల మేరకు బొమ్మయ్యపల్లిలో మద్యం అమ్మకాలు జోరుగా జరుగుతున్నట్లు అందిన రహస్య సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో అదే గ్రామానికి చెందిన మునికృష్ణయ్య కుమారుడు కే.చరణ్‌రాజ్ ఇంటిలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 11 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, నిందితున్ని రిమాండుకు తరలించినట్లు చెప్పారు.

ఏనుగు దాడిలో పూరిల్లు ధ్వంసం

బంగారుపాళెం: మండలంలోని అటవీ సరిహద్దు గ్రామమైన సామచేనుమిట్టలో బుధవారం రాత్రి ఏనుగు దాడిలో పూరిల్లు ధ్వంసమైనట్టు బాధితులు తెలిపారు. రాత్రి ఒంటరి ఏనుగు అడవి నుంచి సామచేనుమిట్ట చెక్ పోస్టు సమీపంలో నివాసం ఉంటున్న కృష్ణయ్య పూరి గుడిసెపై దాడి చేసింది. ఆ సమయంలో నిద్రిస్తున్న కృష్ణయ్య దంపతులతోపాటు చెక్ పో స్టులో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది భయంతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది, ట్రాకర్లు అక్కడికి చేరుకుని ఒంటరి ఏనుగును అడవిలోకి తరిమేశారు. ఏనుగు దాడిలో ఇంటిలో ఉన్న వస్తువులు దెబ్బతిన్నాయని, ఆదుకోవాలని బాధితులు కోరారు.

కక్షపూరిత సర్కారు..
పీహెచ్‌సీ మూసేశారు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తే.. కూటమి సర్కారు మాత్రం నిర్లక్ష్యం చూపుతోంది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలి కక్ష పూరిత ధోరణి పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వ పాలకులు.. తాజాగా గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉన్న చౌడేపల్లె మండలం లద్దిగం పీహెచ్‌సీని నిర్దాక్షిణ్యంగా మూసేశారు. అద్దె వద్దని భవన యజమాని చెబుతున్నా.. అద్దె చెల్లించలేమని సాకు చూపుతూ మూసేయడంతో గ్రామీణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- భవనం అద్దె చెల్లించలేమంటూ కుంటిసాకు
- 18 గ్రామాల ప్రజలకు తప్పని అవస్థలు
- రూ.కోటి విలువ చేసే స్థలమిచ్చిన దాతలు
- అద్దే వద్దంటున్న యజమాని
- అయినా ప్రజారోగ్యం పట్ల కూటమి సర్కారు నిర్లక్ష్యం
- సిబ్బందిని బదిలీ చేసిన అధికారులు

చౌడేపల్లె: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పేదల ఆరోగ్యం విషయంలో అధిక ప్రాధాన్యత ఇస్తూ వచ్చింది. గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యసేవ లందించాలనే సచివాలయాలతో పాటు పీహెచ్‌సీలను మరిన్ని అందుబాటులోకి తెచ్చింది. అందులో భాగంగా చౌడేపల్లె మండలంలోని లద్దిగం గ్రామంలో మారుమూల గ్రామాల ప్రజల కోసం పీహెచ్‌సీని ఏర్పాటు చేశారు. గతేడాది జూన్ 8న ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. అప్పటి నుంచి ఈ పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు, ఇద్దరు సూపర్‌వైజర్లతో పాటు సచివాలయ ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు సిబ్బందితో కలిసి వైద్యసేవలందించేవారు. ఇక్కడ బోయకొండ గంగమ్మ దర్శనం కోసం వచ్చే యాత్రికులు, చౌడేపల్లె, పుంగనూరు మండలాలకు చెందిన ఐదు పంచాయతీల నుంచి సుమారు 18 గ్రామాల ప్రజలు, గర్భిణులు, బాలింతలు వైద్యసేవలు పొందేవారు. రోజూ 70 నుంచి వందకు పైగా ఓపీలు నమోదయ్యేవి. ఇంత సౌకర్యంగా ఉన్న పీహెచ్‌సీని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆస్పత్రి భవనానికి అద్దె చెల్లించలేమనే సాకుతో అధికారులు మూతవేశారు. సర్పంచ్ కృష్ణారెడ్డి స్పందించి గ్రామస్తుల విన్నపం మేరకు గ్రామంలోనే నూతనంగా నిర్మించిన డిజిటల్ లైబ్రరీ భవనాన్ని ప్రజా సౌకర్యం దృష్ట్యా ఆస్పత్రి నిర్వహణకు కేటాయించారు. అద్దెభవనంలోని ఆస్పత్రి పరికరాలు, మందులను అందులోకి మార్పుచేశారు. ఇక అద్దె కట్టాల్సిన అవసరం లేదని



ఆస్పత్రి కోసం ప్రస్తుతం కేటాయించిన డిజిటల్ లైబ్రరీ భవనం

ఆస్పత్రిని ఇక్కడే కొనసాగించాలని కోరినా ఫలితం లేకపోయింది. గ్రామానికి ఆస్పత్రి సిబ్బంది రాకపోగా, అక్కడ ఉన్న సిబ్బందిని చౌడేపల్లె పీహెచ్‌సీకి అనుసంధానం చేసి అక్కడే విధులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశారు. మరో డాక్టర్‌ను పలమనేరుకు బదిలీ చేశారు. ప్రస్తుతం ఆస్పత్రి మూతవేయడంతో 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న చౌడేపల్లెకు.. లేదంటే పుంగనూరుకు వెళ్లాల్సి వస్తోందని దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.కోటి విలువ చేసే స్థలం విరాళం..

ఆస్పత్రి పక్కా భవనం నిర్మాణానికి పుంగనూరు ప్రధాన రహదారికి పక్కనే దాతలు కృష్ణారెడ్డి, మధుసూదనరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఎస్.కృష్ణారెడ్డితో పాటు మరికొందరు కలిసి సర్వే నంబరు 43/1లో సుమారు 1.50 ఎకరాల విస్తీర్ణం ఉండే సుమారు రూ.కోటి విలువ చేసే స్థలాన్ని ఆస్పత్రి నిర్మాణానికి విరాళం ఇచ్చారు. అయినా ఫలితం లేకుండా పోతోందని, 30 పడకల ఆస్పత్రి నిర్మాణం కలగా మిగిలి పోతుందేమోనని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


వైద్యం కోసం సుదూరం వెళ్లలేక ఇంటి ముందే లేవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలు

చాలా సౌకర్యంగా ఉండేది



నేను గత రెండేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్నా. నిత్యం మా గ్రామంలోని ఆస్పత్రిలో వైద్యసేవలు పొందేవాన్ని. ఇప్పుడు ఆస్పత్రిని మూసేయడంతో దిక్కుతోచక బయటి ప్రాంతాలకు ఆటోలో వెళ్లి వైద్యసేవలు పొందాల్సి వస్తోంది. మాలాంటి రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పీహెచ్‌సీని తెరిచేలా చర్యలు తీసుకోవాలి. – రామచంద్ర, కిడ్నీ బాధితుడు, లద్దిగం

ఇలా చేయడం తగదు..



గతంలో ఆస్పత్రికి వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడేవాళ్లం. జబ్బు చేస్తే చౌడేపల్లెకు వెళ్లే బాధ లేదనుకునే లోపే లద్దిగంలో ఆస్పత్రి లేదని చెప్పి మూసేశారు. ఎవరిపైనా ఆధార పడకుండా మేమే వెళ్లి ఆస్పత్రిలో చూపించుకునేవాళ్లం. ఇలాచేయడం తగదు. అందరికీ సౌకర్యంగా ఉన్న ఆస్పత్రిని మళ్లీ కొనసాగించేలా చూడాలి. – పి.సిద్ధప్ప, లద్దిగం,చౌడేపల్లె

ఉన్నతాధికారుల నుంచి స్పందన లేదు



మా గ్రామంలోనే పీహెచ్‌సీని కొనసాగించాలని, అద్దె చెల్లించకుండా ఆస్పత్రి నిర్వహణకు తగిన ఏర్పాటు చేశామని ఉన్నతాధికారులకు వినతి చేసినా స్పందన లేదు. మారుమూల గ్రామాల ప్రజల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన ఈ పీహెచ్‌సీని అక్కసుతో మూసేయడం తగదు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని న్యాయం చేయాలి. – వి.కృష్ణారెడ్డి, సర్పంచ్, లద్దిగం

అద్దె నాకొద్దు

లద్దిగంలోని నా భవనంలోనే ఆస్పత్రిని నిర్వహించండి. నాకేమీ నెలానెలా ప్రభుత్వం నుంచే వచ్చే అద్దె అవసరం లేదు. ప్రజల సౌకర్యార్థం గత ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన పీహెచ్‌సీని మా భవనంలోనే నిర్వహించుకోండి. పక్కా భవనం ఏర్పాటు చేసుకుని వెళ్లండి. – రెడ్డెప్పరెడ్డి, విశ్రాంత ప్రిన్సిపల్, అద్దెభవనం యజమాని, లద్దిగం

కర్ణాటక మద్యం స్వాధీనం

పుంగనూరు: పట్టణంలోని తోపుమఠానికి చెందిన నరసింహులును బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. తమకు అందిన రహస్య సమాచారం మేరకు నరసింహులు ఇంటిపై దాడులు చేసి విక్రయించేందుకు నిల్వ ఉంచుకున్న 48 కర్ణాటక మద్యం టెట్రాప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అనంతరం నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ఇసుక టిప్పర్ సీజ్

గుడిపాల: తమిళనాడుకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. వివరాలు ఇలా.. మండలంలోని చీలావల్లె వద్ద టీఎస్18–ఏ యూ–2228 నంబరు గల టిప్పర్ ఇసుక లోడ్‌తో తమిళనాడుకు తరలించేందుకు సిద్ధంగా ఉండడంతో తమకు అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. విచారణలో తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా గుమ్మడిపూండికి చెందిన రాజా(43), శరవణ(40)తో పాటు చిత్తూరు సమీపంలోని మురకంబట్టుకు చెందిన నరసింహులు(40) టిప్పర్‌లో ఇసుకను తమిళనాడుకు తరలిస్తున్నట్లు తేలిందన్నారు. దీంతో టిప్పర్‌ను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

• సూర్యతేజం.. చంద్రవదనం


సూర్యప్రభ వాహనంపై పద్మావతీ అమ్మవారు


చంద్రప్రభ వాహనంపై శ్రీవారి దేవేరి కటాక్షం

శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలు ఏడో రోజైన బుధవారం శుభప్రదంగా సాగాయి. అమ్మవారు సూర్య, చంద్రప్రభలపై గోవర్ధనగిరిధారి, కృష్ణుడి అవతారాల్లో భక్తులను అనుగ్రహించారు. ఉత్సాహ తరంగిణిలా ఉదయం, రాత్రి మాడవీధుల్లో విహరించారు. భక్తజనులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల కోలాటాలు, సంప్రదాయ భజన బృందాల భజనలు, మంగళవాయిద్యాలు, జీయ్యర్ స్వాముల ప్రబంధ పారాయణం, కళా ప్రదర్శనలు, నృత్యాలతో మాడ వీధులు కళకళలాడాయి. – చంద్రగిరి

రెడ్‌క్రాస్ అభివృద్ధికి చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో రెడ్‌క్రాస్ సంస్థ అభివృద్ధికి యువకుల భాగస్వామ్యం అవసరమని జాయింట్ కలెక్టర్, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ విద్యాధరి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో ఆమె వరుస సమావేశాలు నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలతో పాటు, అత్యవసర వైద్య సేవలకు సహాయం చేసేలా యువతీ యువకులను చైతన్య పరచాలన్నారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి, డీఈఓ వరలక్ష్మి, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి సహదేవనాయుడు, పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జీవనజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీహోల్డ్ భూముల వివరాలపై సమీక్ష

జిల్లాలోని తహసీల్దార్లు ఫ్రీహోల్డ్ భూముల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఆదేశించారు. తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఫ్రీహోల్డ్ (పన్ను లేని)భూములకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని మొదట తహసీల్దార్లు పరిశీలించి, తరువాత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ ఫ్రీ హోల్డ్ రిజిస్టర్డ్ భూములకు సంబంధించి మండలాల వారీగా ప్రతి తహసీల్దార్ మరోసారి సర్వే నంబర్, విస్తీర్ణం, హక్కుదారుడి పేరు సంబంధిత వివరాలను క్షేత్రస్థాయిలో పూర్తిగా పరిశీలన చేయాలని ఆదేశించారు.

పకడ్బందీగా రెవెన్యూ సదస్సుల నిర్వహణ

- 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు సదస్సులు
- జిల్లావ్యాప్తంగా 782 గ్రామాల్లో సభలు
- కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ


మాట్లాడుతున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ఈ నెల 6వ తేదీ నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం క్షేత్రస్థాయి అధికారులతో రెవెన్యూ సదస్సుల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ సదస్సుల నిర్వహణకు పకడ్బందీ కార్యాచరణ సిద్ధం చేసినట్లు చెప్పారు. భూ వివాదాలను తగ్గించేందుకు, భూ సమస్యల పరిష్కారానికి జిల్లాస్థాయిలో కార్యక్రమం నిర్వహిస్తున్నామని, పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, ఇందులో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం అవుతారన్నారు. సదస్సుల నిర్వహణ సమాచారాన్ని ముందస్తుగా ఆయా గ్రామాల్లో ముందస్తుగా టాం..టాం వేయించి సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లావ్యాప్తంగా 782 రెవెన్యూ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఆర్‌వో మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జోయెల్.. భలే దొంగ..

- కార్లను అద్దెకు తీసుకుని..ఆపై తనఖా పెట్టడం లేదా అమ్మేయడం ఇతని పని
- ఇప్పటికే పది కార్ల వరకు అమ్మేసినట్లు సమాచారం
- బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు
- పలమనేరులో వెలుగు చూసిన నయా అద్దె కార్ల విక్రయాల దందా

పలమనేరు: పలమనేరు పట్టణంలో నయా మోసం వెలుగు చూసింది. ఓ తెలివైన దొంగ ఏం చేశాడంటే..! ''అన్నా.. మీకార్లను నెలసరి అద్దెకు నాకు అప్పగిస్తే నా వద్ద ఉన్న డ్రైవర్లతో బాడుగలకు పంపించి మీకు నెలసరి అద్దె చెల్లిస్తా'' అని నమ్మబలికాడు. అలా అద్దెకు తెచ్చిన విక్రయించేసి యజమానులను మోసం చేసిన సంఘటన బుధవారం పలమనేరులో సంచలనం రేపింది. వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన జోయెల్ అనే యువకుడు ఈ నయా దందాకు తెరలేపాడు. కారు యజమానులకు ఒకరికి తెలియకుండా మరొకరి నుంచి పది కార్లను నెలసరి అద్దెకు తీసుకుని వారికి ఆ నెలలో మాత్రం ఠంఛనుగా అద్దె చెల్లిస్తూ నమ్మకాన్ని పొందాడు. దీంతో చాలామంది యజమానులు ఇదేదో బాగుందని అతనికి కార్లను అప్పజెప్పారు. రెండోనెలలో కొంత ఇచ్చి, మూడోనెలలో అద్దెలు పెద్దగా లేవని వచ్చే నెలలో అద్దె చెల్లిస్తానంటూ నమ్మబలికాడు.

రంగంలోకి దిగిన పోలీసులు..

కార్లను అద్దెకు తీసుకుని అమ్మేసిన విషయంపై రంగంలోకి దిగిన పలమనేరు ఐడీ పార్టీ పోలీసులు కూపీలాగడంతో అసలు విషయం బయటపడింది. నమ్మకంగా యజమానుల వద్ద తీసుకున్న కార్లను నిందితుడు జోయెల్ చాలా సులభంగా అమ్మేసినట్లు తెలిసింది.

అద్దె ఇవ్వకపోవడంతో డౌట్ వచ్చి..

కార్లను అద్దెకు తీసుకున్న జోయెల్ వ్యక్తి వాటిని కొందరి వద్ద తనఖా పెట్టి డబ్బు తీసుకున్నాడు. మరికొన్ని కార్లను పుంగనూరులో కొందరికి అమ్మేశాడు. సక్రమంగా అద్దె ఇవ్వకపోవడంతో కార్ల యజమానులు ఇతనిపై దృష్టి సారించారు. దీంతో అమ్మకాల విషయం వారి చెవిన పడింది. దీంతో వారిలో కొందరు తమకు జరిగిన మోసంపై స్థానిక పోలీసులకు ఇటీవల ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

రూ.కోటి దాకా కార్లను అమ్మిన వైనం

విచారణలో భాగంగా ఇప్పటిదాకా పదికార్లను రూ.కోటి వరకు విక్రయాలు, తనాఖాలు పెట్టినట్టు పోలీసుల విచారణలో తేలినట్టు సమాచారం. ఇతని నుంచి కార్లను కొన్నవారు సైతం ఈ వాహనాలను స్మగ్లింగ్ వ్యవహారాలకు పంపుతున్నట్టు తెలుస్తోంది. ఈ ప్రాంతం నుంచి ఎక్కువగా ఎర్రచందనం, చౌకబియ్యం, గంజా తదితరాల స్మగర్లకు ఈ కార్లను కొన్నవారు అమ్ముతున్నట్టు తెలుస్తోంది. ఏదేమైనా ఇలా కారు యజమానుల నుంచి అద్దెకు కార్లను పొంది సులభంగా డబ్బులు సంపాదించే కీలకవ్యక్తి ఇప్పుడు పోలీసుల అదుపులో ఉన్నాడు. దీనిపై స్థానిక సీఐని వివరణ కోరగా కేసు విచారణలో ఉందని పూర్తి వివరాలు అరెస్ట్ సమయంలో వెల్లడించనున్నట్టు తెలిపారు.

డీఈఓకు సమ్మె నోటీసు అందజేత

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లకు బోధనేతర కార్యక్రమాల్లో మినహాయింపు కల్పించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు ఈ నెల 11న చేపట్టబోయే నిరసనకు ముందస్తుగా సమ్మె నోటీసును డీఈఓకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఉపాధ్యాయులను తీవ్ర ఆందోళనకు, మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నట్లు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న అసంబద్ధ నిర్ణయాలకు నిరసనగా ఈ నెల 11న డీఈఓ కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. ముందస్తుగా డీఈఓ వరలక్ష్మికి సమ్మె నోటీసు అందజేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖరనాయుడు, మణిగండన్, జిల్లా సహాధ్యక్షులు రెడ్డెప్పనాయుడు, రెహాన బేగం, తదితరులు పాల్గొన్నారు.

రైతులను బురిడీ కొట్టిస్తున్న జిల్లా అధికారులు

ఎరువు	2022 (టన్ను)	పెంచిన శాతం	2024
డీఏపీ	24000	12.5	27000
15-15-15-9	27000	22.8	29000
20-20-0-13	24000	8.3	26000
17-17-17	19780	26.39	25000

విజయపురం : రాష్ట్రంలో ఎరువుల రేట్లు పెరగలేదని జిల్లా అధికారులు అసత్య ప్రచారం చేస్తూ రైతులను బురిడీ కొటిస్తున్నారు. బుధవారం ఎరువే..పిడుగు అనే శీర్షికపై సాక్షి దినపత్రిలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన జిల్లా అధికారులు ఎరువుల ధరలు పెరగలేదని, సబ్సిడీ ద్వారా ఎరువులు అందిస్తున్నామని చెప్పారు. వారు చెప్పిన దాని ప్రకారం రైతులను బురిడీ కొటిస్తున్నట్లే కనిపిస్తోంది. అయితే మండల స్థాయి అధికారులు ఇచ్చిన ధరల పట్టిక ప్రకారం ఎరువుల ధరల వివరాలు ఇలా ఉన్నాయి..

సాక్షి ఎఫెక్ట్..

స్పష్టత ఇస్తారా..!

ఇప్పటికైనా రైతులకు అందించే ఎరువుల ధరలపై జిల్లా అధికారులు స్పష్టత ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

గుడుపల్లె: మండలంలో గంజాయి విక్రయిస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు.. రైల్వేస్టేషన్ సమీపంలోని సిరిగిరిపల్లె నుంచి కుప్పిగానిపల్లెకు వెళ్లే దారిలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ తన సిబ్బందితో వెళ్లి దాడులు చేశారు. కుప్పిగానిపల్లెకు చెందిన మునియప్ప, కాడేపల్లెకు చెందిన మదన్, గుడుపల్లెకు చెందిన గజేంద్రను అదుపులోకి తీసుకున్నారు. అలాగే వీరికి గంజాయి సరఫరా చేసే మండలంలోని పాపానూరు గ్రామ సమీపంలో ఉన్న ఓ క్వారీలో చెఫ్‌గా పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన పాంచు బిస్వాల్‌ను అరెస్టు చేశామని ఎస్‌ఐ తెలిపారు. ఈ నలుగురి వద్ద నుంచి 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపామన్నారు. పాంచు బిస్వాల్ ఒడిశాకు వెళ్లి తక్కువ ధరకు గంజాయిని తెచ్చి మునియప్ప వద్ద ఉంచి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జాతీయ ఆరోగ్య మిషన్‌లో పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతిదేవి తెలిపారు. ఫిజీషియన్, వైద్యాధికారులు, స్టాఫ్‌నర్సులు, డెంటిస్ట్, అప్టోమెట్రిస్ట్, ఆడియాలజీ కమ్ స్పీచ్ థెరపిస్ట్ ఎర్లింటర్ వెన్సిస్ట్ కమ్ స్పెషల్ ఎడ్యుకేటర్, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, లాస్ట్‌గ్రేడ్ సర్వీసెస్ పోస్టుల ఖాళీలు ఉన్నాయన్నారు. ఇందుకు అర్హత కలిగిన అభ్యర్థులు గురువారం నుంచి 13వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

జెడ్పీ పరిధిలో కారుణ్య నియామకాలు

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ పరిధిలో కారుణ్య నియామకాల కింద 14 ఉద్యోగాలను భర్తీ చేసినట్లు సీఈఓ రవికుమార్‌నాయుడు తెలిపారు. బుధవారం జెడ్పీ కార్యాలయంలో సంబంధిత ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి అభ్యర్థులతో మాట్లాడారు. అందులో పూర్ణచంద్రశేఖర్‌సాయి, హదషా, శ్రీలత, విక్రమ్, ధనలక్ష్మి, దీపక, రాజశేఖర్, నాగేంద్ర, జయశ్రీ, మనోజ్‌కుమార్, ఉదయ్‌కుమార్, షేక్‌అయిషా, కల్పన, రాజేశ్వరిని అటెండర్లుగా నియమించామన్నారు.